www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం జనవరి 29 2025
5
చిత్తూరు

దళితునిపై పెత్తందారు దాడి

- దళితుడు దుర్మరణం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..
- దళిత సంఘాల ధర్నా

ప్రజాశక్తి - సదుం : భూ వివాదాల కారణంగా ఓ దళితునిపై అధికార పార్టీకి చెందిన పెత్తందారుడు దాడికి పాల్పడటంతో దళితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై పోలీసులు విచారణ జరిపి బాధిత కుటుంబానికి తగిన న్యాయంచేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు సదుం పోలీసుస్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని నడిగడ్డ గ్రామ పంచాయతీ మాదిగ పల్లికి చెందిన సదుం రమణయ్య (65)కు ఇదే గ్రామ పంచాయతీ పరిధిలోని నడిగడ్డ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఎస్ జి పవన్ కుమార్ రెడ్డికి గత 30 సంవత్సరాలుగా భూ వివాదాలు కొనసాగు తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల ప్రాంతంలో దళితుడు సదుం రమణయ్య తన మామిడి తోటలో దున్నకాలు పనులు చేస్తుండగా ఎస్‌జి పవన్ కుమార్ రెడ్డి అక్కడికి వచ్చాడు. రమణయ్యతో ఘర్షణకు దిగాడు. వివాదం పెరిగి పవన్‌కుమార్‌రెడ్డి బలంగా తోశాడు. వృద్ధుడైన రమణయ్య కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడని రమణయ్య భార్య నర్స మ్మ పేర్కొంది. ఇతనికి ముగ్గురు కుమార్తెలు వున్నారు. కుటుంబ పెద్ద దిక్కు అయిన భర్త చని పోవడంతో తనకు, తన కుమార్తె లకు దిక్కెవరని అని నరసమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీంతో మాదిగ పల్లి శోక సంద్రంలో మునిగి పోయింది. ఈ విషయం తెలుసు కున్న దళిత సంఘాల నాయకులు నడిగడ్డ మాదిగ పల్లికి చేరుకున్నారు. సదుం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరిస్తున్నారు.

దాడిలో మృతి చెందిన రమణయ్య

ధర్నా నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్, దళిత సంఘాల నాయకులు

ఎంఆర్‌పిఎస్, దళిత సంఘాల ధర్నా

మృతుడు సదుం రమణయ్యపై పెత్తందారుడు దాడిని నిరసిస్తూ వెంటనే నిందితుడిని అరెస్టు చేయాలని సదుం, సోమల ఎంఆర్‌పిఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు, మృతుడి బంధువులు, సదుం పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి బైఠా యించి ధర్నా నిర్వ హించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

చిత్తూరు అర్బన్ : సదుం మండలం నడిగడ్డ గ్రామ పంచాయతీ మాదిగ పల్లి రమణయ్య మృతి కి కారణమైన పవన్ కుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేసి మృతుడి కుటుంబానికి నష్టపరిహారం రూ.50 లక్షలు చెల్లించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్య ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ అండతో రెచ్చిపోవడం దారుణం అన్నారు. వృద్ధుడు అని కూడా చూడకుండా దౌర్జన్యం చేయడం సిగ్గు చేటు అన్నారు. కుటుంబాన్ని పెద్ద దిక్కు అయిన రమణయ్య చనిపోవడంతో ఆ కుటుంబం అనాథగా మారిందని వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు చిత్తశుద్ధితో కేసు నమోదు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

రైతులపై ఎరువుల భారం

అమాంతం... పెరిగిన ధరలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏటా నష్టాలతో సతమతమవుతున్న రైతులపై అమాతంగా పెరిగిన ఎరువుల ధరలు రైతుకు అదనపు భారంగా మారుతోంది... ఆరుగాలం కష్టంచి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న రైతుల్లో అనేక మంది వ్యవసాయం చేయడం మానేశారు. తాజాగా ఎరువుల ధరలు రైతునడ్డి విరిచేలా ఉన్నాయి. మూడు రకాల కాంప్లెక్స్ ఎరువులను కంపెనీలు పెంచేశాయి. గత కాంప్లెక్స్ 20-20 , 0 13 బస్తా ఎరువుల ధర రూ 1,200 ఉండేది. ప్రస్తుతం ఇదే బస్తా ఎరువు రూ. 1,300 కు పెరిగింది. 14-35-14 బస్తా రూ.1,700 గత ఏడాది ఉంటే ప్రస్తుతం రూ. 1,800, 21-24-0 బస్తా రూ. 1,700 నుంచి రూ.1,800కు పెంచారు. యూరియా ధర 45 కిలోల బస్తా రూ. 288.50 ఉంది. వరి మొక్కజొన్న , వేరుశనగ పంటలకు కాంప్లెక్సు, డిఏపి , యూరియా అవసరం.. వరికి ఎకరానికి ఆరు బస్తాల వరకు కాంప్లెక్సు, డిఏపి రెండు బస్తాలు, ఐదు బస్తాల వరకు నత్రజని ఎరువులు వాడాల్సి ఉంటుంది. మార్కెట్లో వేరుశనగ, మామిడి, టమోటా ఇతర ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న రైతుపై పెరిగిన ఎరువుల ధరలు అదనపు భారం కానున్నాయి.

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు..

సాగుపెట్టుబడి రాక , గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న రైతులపై పెరిగిన ఎరువుల ధరలు రైతుపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా వుంది. జిల్లాలో గత ఏడాది 31 మండలాల్లో రబీ విస్తీర్ణం 19,345 హెకార్లు, ప్రస్తుత సాగు 16,241 ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైంది. సాగుకు సిద్ధం అవుతున్న రైతులకు ఎరువులు అవసరం. ఖరీఫ్ విస్తీర్ణం 88,525 హెక్టార్లు కాగా సాగు విస్తీర్ణం 1,07,228 వుంది. జిల్లాలో కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైంది. దీని వల్ల కొన్ని ప్రధాన పంటలు సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే పంటల సాగు తగ్గింది. ఉలవపంట పత్యామ్నాయ పంటగా 80 శాతం సబ్సిడీతో ఉలవలు 13,510 క్వింటాళ్లు పంపిణీ చేసినా ఉలవ సాగుపై రైతులు ఆసక్తి చూపక పోవడంతో జిల్లాకు సబ్సిడీపై మంజూరైన ఉలవలను తిరిగి పంపాల్సి వచ్చింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ ధరలకు అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రీ సర్వే అర్జీలపై ఇంత నిర్లక్ష్యమా?

- రెండు నెలలు అవుతున్నా ఎందుకు పరిష్కరించలేదు? ● తీరు మారకుంటే చర్యలు తప్పవు ● రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి -యాదమరి: 'యాదమరి మండలంలో రీ సర్వే గ్రామ సదస్సులు వచ్చిన అర్జీలపై ఇంత నిర్లక్ష్యమా...? రెండు నెలలు అవుతున్నా ఎందుకు పరిష్కరించలేదు..తీరుమారకుంటే చర్యలు తప్పవు..!' అని యాదమరి రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పర్యటనకు విచ్చేసిన కలెక్టర్ మొదట చిత్తూరు గుడియాత్తం రోడ్డు పనులను పరిశీలించి అనంతరం యాదమరి తహశీల్దారు కార్యాలయం లో రెండు గంటలపాటు, రీ సర్వే, రెవెన్యూ సదస్సుల లో సమస్యలపై వచ్చిన అర్జీలను రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు ,విలేజ్ సర్వేయర్స్, రెవెన్యూ గ్రామాల వారీగా ఒక్కొక్కరితో గ్రామాల్లో ఏ ఏ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఎన్ని వినతులు వచ్చాయి? అవి ఎన్ని పరిశీలించారు.. ఎన్ని పూర్తి చేశారు.. ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి.. అవి ఎందుకు పరిష్కరించలేదు. వాటి కారణాలు ఏమిటి?' అని వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రీ సర్వేకు సంబంధించి 669 అర్జీలు రాగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి 317 అర్జీలు వచ్చాయి. మొత్తం 985 అర్జీలు వినతలు రూపంలో భూ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు రైతులు దరఖాస్తులు ఇచ్చారు. రీ సర్వేపై రెవెన్యూ సదస్సులు ముగిసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మండలంలో రైతులు నుంచి స్వీకరించిన రీ సర్వేలో వచ్చిన అర్జీల సమస్యలపై వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్స్, సమస్యల పరిష్కరించడంలో ఇంత నిర్లక్షంగా వ్యవహరిస్తే ఎలా?' అని కలెక్టర్ రెవెన్యూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు . క్షేత్రస్థాయిలో భూ సమస్యలపై పరిస్థితి వస్తే మ్యుటేషన్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి సర్వే సంబంధించి ఎన్ని... కరెక్షన్స్ ఎన్ని నోషనల్ ఖాతాలో ఎన్ని.. దరఖాస్తులు వచ్చాయి.? వీటి సంబంధించిన వివరాలు ఎక్కడున్నాయి?' అని వీఆర్వోలను ప్రశ్నించారు. మండలంలో 985 అర్జీలు వస్తే ఇప్పటివరకు ఎన్ని ఆన్‌లైనులో నమోదు చేశారు. నమోదు చేసి ఉంటే ఆన్‌లైనులో ఎందుకు కనిపించడం లేదు? రైతుల ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. వచ్చే వారంలోపు సమస్యలను పూర్తి స్థాయిలో క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలించి సమస్యలను పరిష్కరించి ఆన్‌లైనులో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై మండలానికి మరోసారి వచ్చి రివ్యూ చేస్తానని ఆలోపు క్షేత్రస్థాయిలో వెళ్లి రీ సర్వేలో వచ్చిన ప్రతి సమస్యలను పరిష్కరిం చాలన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు

అనంతరం పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో పారిశుధ్యం చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామాల్లో శానిటేషన్, ఓవర్ హెడ్ అండ్ లీకేజీ, ప్రతి నెలా ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని, వస్తున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ను ఆదేశించారు. కలెక్టర్ రు రెవెన్యూ కార్యాలయంలో ఉన్నారని తెలియడం కలెక్టర్ ఎప్పుడు బయట కు వస్తారో అని వేచి చూసి పలువురు భూ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు అందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. వెంటనే తహశీల్దారును ను పిలిచి మండలంలో భూ సమస్యల అధికంగా ఉన్నాయని, భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది వీఆర్వోలు, సర్వేర్లతో సమన్వయంతో సమస్యలు వెంటనే పరిష్కరించాలని తహశీల్దారును ఆదేశించారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి

కొనసాగుతున్న విఓఎల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరుతూ చిత్తూరు కలెక్టర్ వద్ద ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన సామూహిక దీక్ష రెండవ రోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వహించకపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వ కుండా పని చేయించు కోవడం వెట్టి చాకిరీ అవుతుందన్నారు. పోరాటా నికి పిలుపు నిచ్చిన సందర్భంగా రెండు నెలలు వేతనాలు వేస్తున్నా మని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, అంటే పోరా డితే కానీ జీతాలు ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మూడు సంవత్స రాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 16వ తేదీ సెర్ప్ సీఈవో సమక్షంలో నిర్వహించిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకు అమలు కాకపోవడం అత్యంత శో చనీయమన్నారు. అక్రమంగా తొలగించిన వివోఏ లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయక పోవడం కోర్టు ధిక్కా రమన్నారు. విపరీతమైన పనిభారం పెంచారని, మహిళా మార్ట్‌లలో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేక వస్తోంద న్నారు. సమస్యల పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. గ్రూప్ సభ్యులు అభయహస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. ఇలా ప్రజలు, వివోఏల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందడాన్ని నిరసిస్తూ ఈ మూడు రోజుల నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, నాయకులు, వివోఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యానిమేటర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

మండల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించండి

మండల అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, క్షేత్ర స్థాయిలో పలు పథకాల అమలు తీరు, లబ్ధిదారులకు చేరుతున్నదీ లేనిది పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం లో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరితో కలసి ప్రభుత్వ పథకాల అమలు తీరు, పర్యవేక్షణకు తీసుకోవలసిన చర్యలపై మండల ప్రత్యేక అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా పలు పథకాలను అమలు చేస్తున్నారని వీటి అమలు తీరు, శాఖల పని తీరును పర్యవేక్షించడం ద్వారా లోపాలను సరిదిద్ది సమర్ధవంతంగా ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, హాస్టళ్లు, పిహెచ్‌సి లు, సచివాలయాలు, సంబంధిత కార్యాలయాలన్నింటినీ పరిశీలించడం ద్వారా సిబ్బంది పని తీరును అంచనా వేయవచ్చునని, లోపాలను గుర్తించి సరిదిద్దేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనం తనిఖీ, బడి బయట పిల్లల వివరాల సేకరణ, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం సరఫరా సంబంధిత అంశాల పరిశీలన, పిహెచ్‌సి స్థాయిలో మెడికల్ ఆఫీసర్ల సమయ పాలన పరిశీలన, మందుల నిల్వ సామర్థ్యం, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతల నమోదు, పౌష్టికాహారం వారికి అందుతున్నదీ లేనిది పరిశీలించడం, వారి పని తీరులో లోపాలు ఉంటే గుర్తించి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి నిర్ణీత గడువు లోపు వారి లోపాలను సరిదిద్దుకుని పని చేసేలా సూచనలు చేయడం, తద్వారా పరిపాలన సులువుగా సమర్థవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్డీఓలు రేవెన్యూ అంశాల పైనే కాకుండా వారి పరిధిలోని అన్ని కార్యాలయాల పని తీరును పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, పిఆర్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డిఈఓ వరలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, జిల్లా హార్టి కల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి, డిఎల్ డిఓ రవి కుమార్, ఆర్అండ్‌బి ఈ ఈ శ్రీనివాసులు, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఇతర సంబంధిత అధికారులు కలెక్టరేట్ నుండి పాల్గొనగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలమనేరు, కుప్పం, నగరి ఆర్‌డిఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మెరిట్ లిస్టు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీ విడుదల చేసిన మెరిట్ లిస్టు జాబితా ఆన్‌లైన్‌లో ఉంచినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 28 తేది మంగళవారం నుండీ నుండి ఫిబ్రవరి 4వ తేది సాయంత్రం ఐదు గంటల లోపు తగిన ఆధారాలతో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి స్వయంగా సమర్పించాలని తెలిపారు. గడువు తీరిన తర్వాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబోమని పేర్కొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలను అందుకున్న వారిని రెవెన్యూ శాఖ సిబ్బంది ఘనంగా సన్మానిం చారు. మండల తహశీల్దారు చిట్టిబాబు, మండల సర్వేయర్ పలని, పట్టణ విఆర్ఎ సాయి కుమార్ లు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికై గణతంత్ర దినోత్సవం రోజు జిల్లా పాలనాధికారి సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందు కున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగు లుగా ప్రశంసా పత్రాలను అందు కున్న అధికారి ని, ఉద్యోగు లను సాటి ఉద్యోగులు శాలువ తో సన్మానించి, పూల మాలలు వేసి అభినందించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్‌ఏఎస్ సెక్రటరీ భారతి

ప్రజాశక్తి - యాదమరి: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రెటరీ ఎంఎస్‌భారతి పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు డిఆర్‌డిఏ ట్రైనింగ్ సెంటర్ లో 'మానవ అక్రమ రవాణా నుండి మహిళలు, పిల్లలకు రక్షణ' అనే అంశంపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జితో పాటు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఆర్‌డిఏ పీడీ శ్రీదేవి విచ్చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రెటరీ మాట్లాడుతూ సమాజంలో మానవ అక్రమ రవాణా మితిమీరి పోతోందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను జాగ్రత్తగా గమనించుకోవాలని సూచించారు. పిల్లలను పట్టించుకోకపోవడం వల్ల దారి తప్పుతున్నారని, ఈ విషయంలో తల్లిదండ్రులు మరింత భాధ్యత తీసు కోవాలన్నారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐసిడిఎస్ పీడీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విషయాలు తెలుపుతూ క్రమశిక్షణతో పెంచాలని, పిల్లల అక్రమ రవాణా నిర్మాలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలుపుతూ మహిళా, శిశు సంక్షేమ హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ మహిళా సాధికారత జరుగుతోందని, వారి పరిధిలోని మహిళలకు అవగాహన కలిగించి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. దిశ పోలీస్ స్టేషన్ నుండి డి ఎస్ పి విజయ శేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఫోన్ కు బానిసలు అవుతున్నారని, అందులో మంచి, చెడు వున్నాయన్నారు. అయితే పెడదోవ పడుతూ పిల్లలు అరాచకాలకు గురవుతున్నారన్నారు. మంచి విషయాలను ఆచరిస్తూ చెడును వదిలేయాలని హితవు పలికారు. హాజరైన వారితో 'అడపిల్లని రక్షిద్దాం - అడపిల్లని చదివిద్దాం' అంటూ జిల్లా బాలల పరిరక్షణ అధికారి అందరి వద్ద ప్రతిజ్ఞ చేయించారు. అక్రమ రవాణా వల్ల ఎదురయ్యే సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో దిశా డిఎస్‌పి విజయశేఖర్, దిశా ఎస్ఐ నాగసౌజన్య, ఐసిడిఎస్ నోడల్ అధికారి జయంతి, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, సమాఖ్య లీడర్స్, మహిళా పోలీస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి భారతి

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి -పలమనేరు: ఫిబ్రవరి 1 ,2 ,3వ తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పలమనేరు నాయకులు కోరారు. మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ తేదీ నెల్లూరు పట్టణంలో నిర్వహించే బహిరంగ సభకి తరలి రావాలని ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆత్మకూరు బస్టాండు నుంచి విఆర్ కాలేజీ గ్రౌండ్ వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీకి ఆల్ ఇండియా కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్, పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొం టా రని పేర్కొన్నారు. ఈ మహా సభలకు కార్మిక, కర్షక, వివిధ రంగాల వారు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఎం సభ్యులు రాజా ఈశ్వర, జయంతి , ధనమ్మ, సరోజమ్మ, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరంలో హైరోడ్ విస్తరణ పనులను కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మంగళ వారం పరిశీ లించారు. హైరో డ్డు పరిధిలో నిర్వ హిస్తున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగం గా దేవాదాయ శాఖకు సంబంధించి స్థలాలను శుభ్రం పనులను పరిశీలించారు. మొత్తం 14 నిర్మాణాలను తొలగించే పనులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. రోడ్డు విస్తరణ చర్యల్లో భాగంగా మార్కింగ్ మేరకు నిర్మాణాలను తొలగించే పనులు వేగవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రణాళిక శాఖ అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, దేవాదాయ శాఖ అధికారులు, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్‌పి శివానంద కిషోర్

పోలీస్ శాఖకు ఏఆర్ వెన్నెముక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఏఆర్ విభాగం ప్రత్యేకమైం దని, వైవిధ్య మైందని జిల్లా పోలీసు శాఖకు వెన్నెముక లాంటిదని ఏఆర్ అడిషనల్ ఎస్‌పి శివానంద కిషోర్ పేర్కొన్నారు. ఏఆర్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ బలగానికి వార్షిక మొబి లైజేషన్ మంగళవారం ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం చిత్తూరు జిల్లా ఏఆర్ బలగానికి వార్షిక మొబిలైజేషన్‌ను నిర్వహించడం ఆనవాయితీ. చిత్తూరులో పోలీసు సిబ్బంది, అధికారుల కోసం వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏఆర్ అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ ఈ పది రోజుల కార్యక్రమంలో సిబ్బంది, అధికారులకు అన్ని రకాల నైపుణ్యాలను పునఃసమీక్షించి వాటిలో నిష్ణాతు లుగా చేస్తామని, జిల్లాకు ఈ బలగం వెన్నెముక లాంటిదన్నారు. వీరి ఉద్యోగం వైవిధ్య భరితమే కాకుండా కష్టతరమని పేర్కొంటూ ఈ పది రోజుల నైపుణ్య పునఃసమీక్ష కార్యక్రమంలో అన్ని రకాల నైపుణ్యాలను పూర్తి క్రమశిక్షణతో నేర్చు కోవాలని, తమ విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం పెంపొందించేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ మొబిలైజేషన్ కార్యక్రమంలో జనరల్ డ్యూటీ చేసే సిబ్బందితో పాటు మోటార్ ట్రాన్స్‌పోర్టు వింగ్, సెక్యూరిటీ వింగ్, గన్ మ్యాన్ లు, డాగ్ స్క్వాడ్, బ్యాండ్ మొదలైన విభాగాలలో ఉన్న సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి: కలెక్టర్

అధికారులతో రోడ్డు పనుల నాణ్యతపై మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -యాదమరి: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చిత్తూరు - గుడియాత్తం రోడ్డు పనులను మార్చి 15వ తేదీ లోపు నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పూతలపట్టు ఎమ్మెల్యే కె మురళీమోహన్ తో కలిసి చిత్తూరు-గుడియాత్తం రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిత్తూరు -గుడియాత్తం రోడ్డు పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టారని, మార్చి 15వ తేదీ లోపు నాణ్యతతో పూర్తిచేసే వాహన దారులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. 3.88 కిలోమీటర్ల రోడ్డు రూ. 639.50 లక్షలతో చేపట్టిన పనులలో 3.52 కిలోమీటర్లు బీటీ రోడ్డు, 36 కిలోమీటర్లు సిసి రోడు, ముందుకు కలదని పనులను త్వరిత గతిన పూర్తి చేయడం ద్వారా వాహనదారులకు ఇబ్బంది లు తొలగుతాయని ఆ దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. రహదారి పొడవున ఉన్న కల్వర్టర్ల వద్ద పూడికను తొలగించి రోడ్డుపై నీరు నిలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బీటీ రోడ్డు పునరుద్ధరణ

కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి వద్ద గ్రామస్తులు బీటీ రోడ్డు బాగా డ్యామేజ్ అయిందని దీన్ని పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పిఆర్‌ఎస్‌ఈని ఆదేశించారు. ఈ మేరకు బీటీ రోడ్డు పనులు చేపడుతామని గ్రామస్తులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట పిఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీనివాసులు, తహశీల్దారు పార్థసారధి, ఎంపిడివో వేణు, ఆర్ అండ్ బి ఏఈ ఆదికేశవులు, ఇరిగేషన్ ఏఈ ఉషారాణి, డిప్యూటీ తహశీల్దారు జయంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టిడిపి అధ్యక్షులు మొరార్జీ, కార్యదర్శి రబ్బీ, దేశం అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ్ నాయుడు, తులసి రామ్ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

భూ వివాదంలో దాడులు

నలుగురికి గాయాలు

గాయపడిన గ్రామస్తులు

ప్రజాశక్తి - కార్వేటినగరం: ప్రభుత్వ భూమి వివాదంలో కూటమి నాయకులు పరస్పర దాడులకు పాల్పడడంతో నలుగురు గాయపడిన సంఘటన మండల పరిధిలోని ముక్కరవారిపల్లి పంచాయతీ గంగమాంబాపురం లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సిఐ హనుమంతప్ప కథనం మేరకు.. గ్రామానికి సమీపంలో సర్వేనెంబర్ 202/5లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వానికి చెందిన భూమిలో లోకనాథరెడ్డి సాగు చేస్తున్నారు. ఈ విషయమైన పలుమార్లు రెవెన్యూ అధికారులు హెచ్చరించినా పట్టించుకోక పోగా, వారికి ప్రభుత్వం తరపున నోటీసులు పంపారు. అయితే అదే భూమిలో కొంత స్థలాన్ని, గ్రామస్తులు కొళ్లగా శ్మశాన వాటికగా వాడుకుంటూ కర్మక్రియలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కర్మక్రియలు జరుపుకోవడానికి అదే గ్రామంలోని టిడిపి నాయకుడు మహేష్‌తో కలిసి సన్నద్ధం చేస్తున్నట్టు సమాచారం అందుకున్న లోకనాథరెడ్డి తమ భూమిలో కర్మక్రియలు నిర్వహించ కూడదని హెచ్చరించాడు. గ్రామస్తులు మండల తహశీల్దారు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తహశీల్దారు ప్రభుత్వ భూమిలో కర్మక్రియలు జరుపుకోవచ్చని చెప్పడంతో ఆగ్రహానికి గురైన లోకనాథరెడ్డి టిడిపి నాయకుడు మహేష్‌పై దాడి చేశాడు. దీంతో అక్కడే ఉన్న తహశీల్దారు పోలీసులకు సమాచారం అందించి వెళ్లి పోయారు. అయితే చిలికి చిలికి గొడవ తారాస్థాయికి చేరుకోవడంతో జనసేన నాయకుడు లోకనాథరెడ్డి, సోదరుడు ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు మహేష్ ఇంటి వద్దకు చేరుకుని కత్తులు, కర్రలతో దాడి చేసి రాళ్లు రువ్వారు. లోకనాథరెడ్డి సోదరుడు ప్రసాద్ కారుతో టిడిపి నాయకుడిని ఢీకొట్టేందుకు దూసుకొచ్చినట్లు సమాచారం. దీంతో స్థానికులు గొడవ సద్దుమణగడానికి యత్నించిన వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. ఈ దాడులలో టిడిపికి చెందిన మహేష్‌కు ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులైన రమేష్, బాలసుబ్రహ్మణ్యం, మోహన్ ప్రసాద్‌లకు గాయాలైనట్లు సిఐ తెలిపారు. దీంతో ఇరువర్గాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాత్రి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : సొంత ఇంటి స్థలం కలిగి ఉండి ప్రభుత్వ సబ్సిడీతో సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద సొంత ఇంటి స్థలం కలిగి ఉండి ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ ద్వారా ఇల్లు నిర్మించుకోవచ్చని, ఇందుకోసం ప్రభుత్వం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులు నగరపాలక పరిధిలోని సంబంధిత వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వార్డు పరిధిలోని అమినిటీ కార్యదర్శిని కలిసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

అధిక నిధులు కేటాయించాలి

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బడ్జెట్లో అంగన్‌వాడీ కేంద్రాలకు, సిబ్బందికి అధిక నిధులు కేటాయించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా అన్నారు. మంగళవారం బంగారుపాలెం మండలంలోని సిడిపిఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకుంటోందని బడ్జెట్లో నిధులు తక్కువ కేటాయించడం వల్ల గ్రామీణ ప్రాంత పిల్లలకు పోషకాహారం అందివ్వకుండా పోతున్నామని కేంద్ర ప్రభుత్వం ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 37శాతం ఉన్నారని గుర్తించాలన్నారు. వారిలో 17శాతం పిల్లలు తక్కువ పోషకాహారాల లోపాలు తో తక్కువ బరువు ఉన్నారని కేంద్ర ప్రభుత్వమే సర్వే చేపట్టి వ్యవహరించిందని ప్రపంచంలోనే మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కాబోతున్నదని ఎన్డీఏ ప్రభుత్వం చెబుతోందని గ్రామీణ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల వారికి పోషకాహారాలు అందకుండా బలహీనపడు తున్నారన్నారు. రాబోయే బడ్జెట్లో అధిక మొత్తంలో అంగన్వాడీ కేంద్రాలకు నిధులు కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను క్రమబద్ధీకరించి గ్రాడ్యుటీ మంజూరు చేయాలని కనీస వేతనం కార్యకర్తకు 32,000 సహాయకురాలకు 26,000 రూపాయలు చెల్లించి పెన్షన్, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకులు భారతీ, శశికళ, వాణి ,ప్రమీల, అంబికా, సుమంగళి ప్రాజెక్టు నాయకురాలు వరలక్ష్మి, మమత, జీవ పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు ప్రచురించడం భావ్యం కాదు

కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ దామోదర్ నాయుడు

పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము

బోరు బావి తవ్వించిన దృశ్యం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : తనపై తప్పుడు సాక్షి దిన పత్రిక కథనాలను ప్రకటించడం భావ్యం కాదని కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ దామోదర్ నాయుడు (జిమ్ దాము) పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవికాలం దగ్గర పడడంతో ఇప్పటికే పట్టణంలో నీటి సమస్య తలెత్తిందని, సమస్య పరిష్కారానికి పురపాలక సంఘం తరపున అవసరమైన చోట బోరు బావులు తవ్విస్తున్నట్టు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం బోరు బావులు తవ్విస్తుంటే దానిని వక్రీకరిస్తూ సాక్షి దినపత్రిక టిడిపి నేత లేఅవుట్ కు ప్రభుత్వ బోరు అన్న పేరుతో కథనాన్ని ప్రచురించడం పత్రికా ధర్మానికే విరుద్ధమన్నారు. గత 30 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉన్నానని, అయితే ఏనాడు స్వార్థ ప్రయోజనాల కోసం, వ్యక్తిగత ఎదుగుదల కోసం రాజకీయాలను వాడుకోలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని తెలిపారు. తాను నిజాయితీగా ఉన్నందువల్లే ప్రజలు తనను వార్డు సభ్యునిగా, పురపాలక సంఘం కౌన్సిలర్ గా ఎన్నుకున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే తనను పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ గా ఎన్ను కున్నారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలలో భాగంగా టిడిపికి ప్రజలు చరిత్ర ఎరుగని విజయాన్ని కట్ట పెట్టారన్నారు. ఆనాటి నుండి పుర పాలక సంఘం తరపున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో ఫ్లోర్ లీడర్ హోదాలో టిడిపి తరపున క్రియాశీలకంగా పనిచేస్తున్నామన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ సాక్షి దినపత్రికలో తప్పుడు కథనాలను ప్రచురించారని ఆరోపించారు. సాక్షిలో ప్రచురించినట్టుగా తన సొంత స్థలంలో ప్రభుత్వ బోరు తవ్వించి ఉంటే చట్ట రీత్యా తీసుకునే చర్యలకు తాను బాధ్యత వహిస్తానని, అలా నిరూపించని పక్షంలో తను న్యాయస్థానాన్ని ఆశ్రయించి, చట్టరీత్యా తీసుకునే చర్యలకు ఆ పత్రికా యాజమాన్యం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: వెంకట ప్రసాద్

ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా కుష్టు నివారణాధికారి

ప్రజాశక్తి - చౌడేపల్లి: క్షయ, కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేశారు. కుష్టు, క్షయ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 15 రోజులు మించి దగ్గు, జ్వరం రావడం, అకారణంగా బరువు తగ్గడం గల్లలో రక్తం పడటం వంటివి క్షయ లక్షణాలు అని వివరించారు. స్పర్శలేని తెల్ల మచ్చలు, నరాలు ముడుచుకుపోవడం వీటి లక్షణాలు అని వివరించారు టీబీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల పెద్దలకు వేసిన బీసీసీ టీకా గురించి ఆయన ఆరా తీశారు. క్షయ, కుష్టు వ్యాధికి మందులు ఉచితమని వివరించారు. అన్ని ఇండికేటర్స్ వందశాతం సాధించాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నెలకు ప్రభుత్వం రూ.500 రూపాయలు జమ చేస్తుందని దాన్ని పౌష్టికాహారం కోసం వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ పూజ, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ నవీన్, డిపిఎంఓ దేవదాస్, క్షయ, కుష్టు సిబ్బంది స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండలం దిగువ మాఘంలో రాజన్న ఫౌండేషన్ సౌజన్యంతో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ను పూతలపట్టు ఎంఎల్‌ఏ మురళీ మోహన్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం అమర్ రాజా విద్యాలయం 8వ వార్షికోత్సవ వేడుకల్లో అమర్ రాజా వ్యవస్థాపక అధ్యక్షులు గల్లా రామచంద్ర నాయుడుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గల్లా రామచంద్ర నాయుడు అమెరికా నుంచి వచ్చి వ్యాపార సామ్రాజ్యం సృష్టించి చిత్తూరు జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులకి ఉపాధి అవకాశాలు కల్పించి చిత్తూరు జిల్లా అభివృద్ధికి విశేష కృషి నీ అందిస్తు న్నారన్నారు. రాజన్న ఫౌండేషన్ ద్వారా అనేక రకాల సేవ కార్యక్రమాలు చేస్తున్నారని, ఇప్పటికే వేలాదిమంది గ్రామీణ యువతకి ఉచిత శిక్షణ అందించి తన కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఇప్పుడు దిగివమాగంలో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ని తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషంగా వుందని, దిగివమాగం పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత తన నైపుణ్యతను మెరుగుపరచుకోవడానికి, ఈ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని ఆశిస్తున్నానన్నారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ కి సంబంధించిన శిక్షణ ఇస్తారని తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమర రాజా వ్యవ స్థాపక అధ్యక్షులు గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ ఇప్పటికే పేటమిట్ట లోని అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో వేలాది మంది గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని అందులో భాగంగా దిగువ మాగంలో రెండవ బ్రాంచ్‌ని నేడు ప్రారంభించామన్నారు. పిల్లలు చదువులతో పాటు అన్ని రంగాలలో తమ ప్రతిభను మెరుగుపరచుకొని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ సందర్భంగా 600 మంది ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాజన్నా ఫౌండేషన నిర్వాహకులు రాళ్ళపల్లి సతీష్, డీన్ రవికుమార్, అమర రాజా హెచ్ఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ నలినీ కుమార్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ ,డిప్యూటీ జనరల్ మేనేజర్ ధనంజయ నాయుడు,అమర రాజ విద్యాలయం ప్రిన్సిపాల్ జయశ్రీ విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు సోమల మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- సోమల: బుధవారం ఉదయం 11 గంటలకు సోమల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండలంలోని అందరు ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : వైసిపి పాలించిన 2019 -2024 మధ్యలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం మాత్రం మరిచి పోయారని నీతి అయోగ్ రూపొందించిన 'ఆరోగ్య సూచీ నివేదిక-2025' ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీతి అయోగ్ విడుదల చేసిన నివేదికలు చూస్తే నాటి వైసిపి సర్కార్ చేసిన ఆర్థిక విధ్వంసం, రాష్ట్రాన్ని ఏ విధంగా అప్పులపాలు చేశారో అర్థమవు తుందన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చిన నాటి సర్కార్ తెచ్చిన అప్పులను సక్రమంగా వ్యయం చేయలేక పోగా అవినీతిలో కూరుకు పోయిందని ఫలితంగా అప్పులు, వడ్డీలు తిరిగి చెల్లించలేని స్థితికి రాష్ట్రం దిగజారిందన్నారు. 2018-19లో రాష్ట్రంలో సొంత వనరుల ద్వారా ఆదాయం వృద్ధిరేటు 17.1 శాతం ఉంటే, 2022-23లో ఆదాయం రేటు 9.8 శాతానికి దిగజారిందన్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచేందుకు, ఆదాయ వనరు లను పెంచేందుకు తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి, ఐటీ మంత్రి లోకేష్ కృషి కారణంగా ప్రఖ్యాత కంపెనీలు ఏపీకి రానున్నాయన్నారు. వీటి ద్వారా 4.10 లక్షల మందికి ఉపాధి అవకా శాలు లభించనున్నాయని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

వ్యక్తి విజయంలో కెరీర్ ప్లానింగ్ ఎంతో ప్రాముఖ్యం

కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ సెల్‌లో ప్రముఖుల ఉద్బోధ

మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి -విజయపురం, నగరి: ఒక వ్యక్తి విజయాన్ని రూపొందించడంలో కెరీర్ ప్లానింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ) కెరీర్ గైడెన్స్ సెల్, విద్యార్థులకు కెరీర్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించింది. కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రేవతి, ఎకో-క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం అరుణ కుమారి విద్యార్థుల కోసం ఈ సెషన్‌ను ఏర్పాటు చేయడంలో ఆసక్తి చూపారు. తిరుపతికి చెందిన ఎన్‌జీవో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. అంకయ్య, డాక్టర్ గుణశేఖర్లను ముఖ్య వక్తలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒక వ్యక్తి విజయాన్ని రూపొందించడంలో కెరీర్ ప్లానింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని, నేటి ప్రపంచంలో అన్ని విద్యా నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులకు విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాన్ని సాధించడానికి అంకిత భావంతో ఉండటంలో విజయానికి కీలకం అని ఆయన నొక్కి చెప్పారు. విద్యార్థులు తమ ఆకాంక్షలను వాస్తవంలోకి మార్చే వరకు వాటిని సాధించడంలో నిరంతరం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. భవిష్యత్ ఆకాంక్షల పట్ల దృష్టి కేంద్రీకరించి, అంకితభావంతో ఉండటం ద్వారా వారి విద్యా ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. అంకయ్య, గ్రాడ్యుయేషన్ తర్వాత ఉన్నత విద్య, ఉపాధికి అందుబాటులో ఉన్న అనేక అవకాశాలపై విద్యార్థులకు విలువైన సమాచారం అందించారు. 'విజయ సోపాన యాత్ర' అనే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత వారు అనుసరించగల వివిధ మార్గాలపై ఆయన విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సమయ నిర్వహణ, వారి ఆకాంక్షల సాధనలో బలమైన మానవ సంబంధాలను కొనసాగించడం, ప్రాముఖ్యతను పేర్కొన్నారు. వే ఫౌండేషన్‌కు చెందిన వక్త డాక్టర్ గుణశేఖర్ జీవితంలో విజయం సాధించడానికి కృషి, క్రమశిక్షణ ప్రాథమికమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి మహేశ్వరి, బోటనీ లెక్చరర్ డాక్టర్ ఎం అరుణ కుమారి, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ సుహాసిని, ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ ఎం. పంక, జెకెసి ఎఫ్ టిఎం శ్రీ ఆర్ లాల్ బాషా, కామర్స్ ఫ్యాకల్టీ హరికృష్ణ పాల్గొన్నారు.

5న ఉచిత కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వచ్చే నెల 5వ తేదీ పెన్షనర్స్ భవనంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలు వరకు తిరుపతి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్స్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పెన్షన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్‌కార్డు, ఈహెచ్‌సి, ఆధార్ కార్డులు తీసుకురావాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న మంగళవారం తనిఖీ చేశారని మండల వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. దుకాణాలలో బిల్ బుక్ సక్రంగా ఉన్నాయా? అధిక ధరలకు అమ్మకుండా ప్రభుత్వం కేటాయించిన ధరలకే అమ్మాలని వారికి సూచించారు. రైతులకు పంటలకు సంబంధించిన క్రిమి సంహారక మందులను పంటలకు తగినట్లుగా ఇవ్వాలని సూచించారు. అనంతరం పత్తికొండ ఆర్‌బికె కేంద్రంలో రైతులకు వ్యవసాయ మెలకులపై అవగాహన కలిగించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపిడివో

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఎంపిడివో స్పందనతో తాగు నీటి సమస్యకు పరిష్కా రం లభించింది. మండలంలోని కోటాగరం గ్రామంలో నూతన బోరు డ్రిల్లింగ్ వేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో గ్రామం పక్కన ఉన్న గోరల చెరువులో తాగునీటి బోరు మునిగిపోయింది. గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడడంతో గ్రామస్తులు ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డికి అర్జీ ఇవ్వగా ఆయన వెంటనే స్పందించారు. కోటాగరం హెచ్‌డబ్ల్యూకు మంగళవారం నూతన బోరు డ్రిల్లింగ్ వేశారు. బోరు డ్రిల్లింగ్ వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పశు ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రతి గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తారని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పొదలపల్లి చిలమాకులపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పశువులకు పశు వైద్య శిక్షణ గర్భకోశ వ్యాధులకు, నట్టల నివారణ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీవిద్య , వెటర్నరీ అసిస్టెంట్లు, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతు భూసార పరీక్షలు చేసుకోవాలి

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఏడీఏ విజయశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి -బంగారు పాళెం: రైతులు భూసార పరీక్షలు చేపట్టాలని ఏడిఏ విజయ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొల్లాలపల్లి, చిక్కాలపల్లి గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ విజయశంకర్ రెడ్డి మాట్లాడుతూ వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల విధానాలను వివరించారు. భూసార పరీక్షల గురించి వాటి ఆవశ్యకతను గురించి తెలుసుకోవాలని, ఎన్‌పిఎస్-ఎస్ యాప్ ప్రతి ఒక్కరూ వాడుకోవాలని ఇందులో స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి రైతు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫోటో తీసిన వెంటనే తగిన సలహాలు, సూచనలు తెలుపుతామన్నారు. అనంతరం గ్రామంలోని రైతులకి భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, విహెచ్ఎలు కోకిల, యగవమూర్తి, వీఏలు అనిల్, సాయిజ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పలమనేరు : చిత్తూరు జిల్లా పలమనేరు గంటావూరు ఇందిరమ్మ కాలనీలో ఈ మధ్య కొందరు ప్రభుత్వ ఇంటి స్థలాలను జెసిబిలతో చదును చేసి ఆక్రమించు కుంటున్నారని మంగళవారం మధ్యాహ్నం పలమనేరు తహశీల్దారు ఇన్బనాధన్‌కు బిసిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి, పంజాని వెంకటరమణ, నక్క రామచంద్రయ్య ఫిర్యాదు చేశారు. స్థలాలు పరిశీలించి ప్రభుత్వ స్థలాలను రక్షించాలని తహశీల్దా రు ను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో పర్యవేక్షించి కబ్జా కాకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదం

గురుకుల పాఠశాల టీచర్‌కు గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రోడ్డు ప్రమాదంలో గురుకుల పాఠశాల టీచర్ కు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం మేరకు. గుడిపాలలో ఎంపీడీవో ఆఫీస్ లో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సుభాష్ చంద్రబోస్ తన భార్య కె సుధామయి ని గంగాధర నెల్లూరు మండలం సర్విరెడ్డిపల్లె వద్ద వున్న గురుకుల పాఠశాల నుంచి తన బైక్ లో తాళంబేడుకు హైవే రోడ్ లో సోమవారం రాత్రి వెళుతుండగా, వారి బైక్ కు కండిగ వద్ద శునకం అడ్డంగా వచ్చింది. ఈ ప్రమాదంలో బైక్ పై ప్రయాణిస్తున్న దంప తులు కింద పడిపడ్డారు. దీంతో టీచర్ సుధామయి కి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆమె భర్త సుభాష్ చంద్రబోస్ స్వల్పంగా గాయపడ్డాడు. ఆమెకు కొన్ని నెలల పాటు నడవలేని స్థితి ఏర్పడినట్లు డాక్టర్ పేర్కొన్నారని స్థానికులు తెలిపారు.

క్రైం న్యూస్

ఫోర్జరీ సంతకంతో భూమి రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఫోర్జరీ సంతకంతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు..మండలంలోని మహదేవ మంగళంలో ఉన్న వ్యక్తుల భూములను గ్రామ సర్వేయర్ సంతకం ఫోర్జరీ ద్వారా ఉపయోగించుకుని అధికారులను సైతం ఏమార్చిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మహదేవ మంగళం నివాసి సోమాచారి కుమారుడు పట్టాభి ఆచారి తన భూమిని అక్రమంగా కబ్జాకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన అక్రమార్కులు తన భూమిని కబ్జా చేసేందుకు పన్నాగాలు పన్ని, అధికారులను తప్పుదోవ పట్టించి భూమిని కాజేశాడని బాధితుడు గుర్తించేలోపు ఆ భూమిని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఈ అక్రమాలపై గంగాధరనెల్లూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు మహదేవ మంగళంకు చెందిన నిందితులు ఏ 1 ఎస్ ఎస్ నటరాజ్, ఏ 2 కే శంకర్ రెడ్డి, ఏ 3 రంగమ్మ, తవణంపల్లి మండలం, ఎంజి పల్లి కు చెందిన ఏ 4 ఎన్ భాస్కర్, ఏ 5 సుబ్రహ్మణ్యం, ఏ 6 కే గంగాధర రెడ్డిలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు పట్టాభి ఆచారి గ్రామ సర్వే యర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించి అమ్మేసిన విషయాన్ని రిజిస్ట్రార్ ను సంప్రదించి తనకు ఎదురైన ఇబ్బందిని, వాస్తవాలను వివరించారు. రిజిస్ట్రార్ ఈ రెండు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు బాధితుడికి చెప్పారు. అనంతరం బాధితుడు పట్టాభి ఆచారి ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : మాదిగ కుల ఆడపడుచులను అవమానకరంగా మాట్లాడిన (సస్పెండెడ్) న్యాయమూర్తి రామకృష్ణపై న్యాయమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు మల్లానూరు రాజ్ కుమార్ లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు కుప్పం పట్టణ పోలీసులకు న్యాయమూర్తి పై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ శాసన సభ్యురాలు, ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి గురించి న్యాయమూర్తి అసభ్య పదజాలన్ని ప్రయోగించడం పై మండి పడ్డారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉంటూ, సమాజానికి ఆదర్శంగా నిలవవలసిన వ్యక్తి కనీసం మహిళ అన్న గౌరవం కూడా చూపకుండా మాట్లాడడం భావ్యం కాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బాధ్యతారహితంగా ప్రవర్తించిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, మహిళల ఆత్మగౌరవానికి రక్షణ కల్పించాల్సిందిగా పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాదిగ కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిల్లలపై శ్రద్ధ వహించాలి: సిడిపివో

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పిల్లల శ్రద్ధ తీసుకోవాలని తీయాలని అంగన్వాడీ కార్యకర్తలను ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ గుండ్లపల్లి వినతశ్రీ ఆదేశించారు. మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాల యంలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఆమె పిల్లల గ్రోత్ ఏ విధంగా చేయాలో అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేయాలని కోరారు. ప్రతినెల పిల్లల ఎత్తు బరువు పరిశీలించి రికార్డుల నమోదు చేయాలన్నారు . వయసుకు తగ్గట్టుగా బరువు ఎత్తు లేకపోతే అలాంటి పిల్లల అనారోగ్య సమస్య ఏర్పడినప్పుడు వారి శరీరం వాటిని తట్టుకోలేక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అనురాధ, సంగీత, పలువురు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అధికారుల దృష్టి

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు మెయిన్ రోడ్ లో ని గ్రామ చావడి గత ఐదు సంవత్సరాలుగా తెరుచుకోక చెత్తాచెదారం పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా దుర్గంధ భరితంగా మారి ఆక్రమణలకు లోనైంది. ఈ పరిసరాలను మంగళవారం మధ్యాహ్నం పలమనేరు మండల తమశీల్దారు ఇమ్బనాధన్ ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత: డిఎస్‌పి

ప్రజాశక్తి -విజయపురం నగరి : 'హెల్మెట్ భారం కాదు.. భద్రత' అని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ అన్నారు. 36వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నగరి పట్టణంలో హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించే నిమిత్తం 100 మంది చేపట్టిన హెల్మెట్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంలో బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరి పట్టణంలోని ప్రధాన మార్గాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం చాలా విలువైందని వాహనాలు నడిపే సమయంలో క్షణం వ్యవధిలో చేసే పొరపాటు జీవితాన్ని దూరం చేస్తుందన్నారు. హెల్మెట్ ధారణ 90 శాతం ప్రాణాపాయం నుంచి వాహనదారులను రక్షిస్తుందన్నారు. ఇంతటి ప్రయోజనకరమైన హెల్మెట్ భారం కాదని.. భద్రతని వాహనదారులు గ్రహించాలన్నారు. కొన్నిసార్లు తప్పు మనవైపు జరగకపోవచ్చు. కొన్నిసార్లు తప్పు మనది కూడా కావచ్చు. ప్రమాదం ఎలా వస్తుందో తెలియదన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరంచి జాగ్రత్తగా బైక్ నడుపుకొంటూ వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మహేశ్వర్, పోలీసులు, ద్విచక్రవాహన షోరూమ్‌ల సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

జిల్లా వాసులకే ఈడిగ మద్యం షాపు

ప్రజాశక్తి -విజయపురం నగరి : ప్రభుత్వం ఈడిగ కులస్థులకు ఇచ్చే మద్యం షాపు నగరి సర్కిల్ పరిధిలోని నగరి మున్సిపాలిటీకి ఒకటి మంజూరైందని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ షాపునకు టెండర్లు ఆహ్వానించామన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు చిత్తూరు జిల్లాకు చెందిన ఈడిగ కులస్థులే అయివుండాలని, వారి కులం, ఉప కులం, జన్మ స్థలం సర్టిఫికేట్ పొంది వుండాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరి స్టేషన్ నందు దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు. ఏవైనా సందేహాలుంటే కార్యాలయం నందు గానీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9440902548, సబ్ ఇన్‌స్పెక్టర్ 8985603531 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు, దొడ్డిపల్లి లోని చిత్తూర్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణం మండపంలో లాటరీ పద్ధతిలో లబ్దిదారును ఎంపిక చేస్తామని తెలిపారు.

మహా కుంభమేళాలో మాజీ మంత్రి

ప్రజాశక్తి -విజయపురం, నగరి : ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహాకుంభమేళాలో మాజీ మంత్రి ఆర్కేరోజా స్నానం ఆచరించారు. మంగళవారం త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి గంగమ్మకు పూజలు చేశారు. అంతుకు ముందు శక్తి పీఠాన్ని సందర్శించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారుల మరియు భవనములు శాఖ

షార్ట్ టెండర్ నోటీసు సంఖ్య.04/ఇఇ(ర.భ) చిత్తూరు /టెండరు/టి.ఓ /2024-2025, తేది : 28.01.2025

చిత్తూరు (ర.భ) డివిజన్ పరిధి లోని ఆరు పనులకి గాను సుమారు రూ. 4,20,000/- అంచనాతో 2024-2025 సంవత్సరమునకు గాను, రెండు నెలలకు సీలు వేసిన టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేది: 29.01.2025 నుండి 31.01.2025 మధ్యాహ్నం 1.00 గంట వరకు, టెండరుదారులు తమ టెండర్లను దాఖలా చేయు తేదీలు 29.01.2025 నుండి 31.01.2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకు. తదుపరి వివరములకు, ఈ కార్యాలయము పని వేళలయందు పొందవచ్చును. మరియు మార్పులు చేర్పులు చేయు అధికారము కార్యనిర్వాహక ఇంజినీరు వారికి కలదు.

కార్యనిర్వాహక ఇంజనీరు
(ర.భ)డివిజన్, చిత్తూరు